సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం। 28 । మార్చి । 2024



మాటేసిన రోడ్డు ప్రమాదం

కోటి ఆశలతో దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టారు వారు.. విధి వక్రీకరించడంతో రోడ్డు ప్రమాదం వారి ఆశలను గల్లంతు చేసింది.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాయచోటి	6.31	4.52
రాజంపేట	6.31	4.55
పీలేరు	6.34	4.51
మదనపల్లె	6.33	5.05

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 50 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	470
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 345.880 కిలోలు



ప్రొద్దుటూరులో జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

జనమంతా సిద్ధం



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పల్లెలన్నీ కదిలిరాగా..
జయజయధ్వానాలు మిన్నంటగా..
జగన్నాథ రథచక్రాలు ముందుకు కదిలాయి..
యుద్ధానికి సిద్ధమైన అర్జునుడి మల్లె..
రథమెక్కిన జనసారధికి
జగమంతా జేజేలు పలికింది..
రెపరెపలాడే వైఎస్సార్ సీపీ జెండాల ముందు..
నిప్పులు చెరిగే ఎండ చిన్నబోయింది.
ఉవ్వెత్తున ఎగసిన ప్రజాభిమానాన్ని చూసి..
పసిడిపురి సైతం నివ్వెరపోయింది.
ఊరూరా.. జనహోరు చూసి..
సొంత గడ్డ మురిసిపోయింది..
విజయుడివై తిరిగి రా..అంటూ..
జనం సాక్షిగా.. నిండుగా దీవించింది..

- ఇడుపులపాయ నుంచి ఎన్నికల శంఖారావం పూరించిన వైఎస్ జగన్
- బస్సు యాత్రకు పోటెత్తిన జనం
- అడుగడుగునా అఖండ స్వాగతం
- మండుటెండను సైతం లెక్క చేయని అభిమానం
- ప్రొద్దుటూరులో దారులన్నీ మేమంతా సిద్ధం సభ వైపే
- పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపిన ముఖ్యమంత్రి ప్రసంగం

సాక్షి కడప/ ప్రొద్దుటూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు జనం జేజేలు పలికారు. కదన కుతూహలంతో.. మండుటెండను సైతం లెక్క చేయకుండా పోటెత్తిన జనం ముందు ఎర్ర సూరీడు కూడా మసకబారాడు. లక్షలాది మంది జనంతో ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభ హోరెత్తింది. జయహో జగన్ నినాదాలతో ప్రొద్దుటూరు పరవశించింది. పల్లె, పట్టణం తేడా లేకుండా జైత్రయాత్ర సాగుతున్న మార్గంలో అడుగడుగునా ఆడపడుచులు హారతి పడితే.. పార్టీ శ్రేణులు, ప్రజలు పూలపాన్పుపై అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం పలికారు. చరిత్ర పుటల్లో తన కంటూ ఓ పేజీలా సమరోత్సాహంతో.. కదన రంగానికి కార్యకర్తలను సన్నద్ధం చేశారు. రాజన్న బిడ్డ రాజ్యం మళ్లీ రావాలంటే అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా సాగిన సుపరిపాలనను గడపగడపకు వెళ్లి వివరించాలని శ్రేణులకు దిశానిర్దేశం



ఇడుపులపాయలో బస్సుయాత్ర ప్రారంభించిన వైఎస్ జగన్‌కు జేజేలు పలుకుతున్న జనం

చేశారు. ఇడుపులపాయ నుంచి ప్రొద్దుటూరు వరకు ఎక్కడ చూసినా జనమే జనం కనిపించారు. అంత మండుటెండలోనూ జగన్ వాహనం వెంట పరుగులు తీస్తూ ఆయన పలకరింపు కోసం అడుగులో అడుగు వేశారు. కనిపించిన ప్రతి ఒక్కరికీ బస్సులో నుంచే సీఎం జగన్ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకెళ్లారు.

సమరోత్సాహంతో...

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన తొలి బహిరంగ సభ బుధవారం ప్రొద్దుటూరులో జరిగింది. ఇడుపులపాయ నుంచి మొదలైన బస్సు యాత్ర వీరన్నగట్టుపల్లి సర్కిల్ నుంచి వేంపల్లె హనుమాన్ జంక్షన్ వరకు కిక్కిరిసిపోయింది. అనంతరం వీరపునాయునిపల్లె మండలం తంగేడుపల్లె క్రాస్‌రోడ్డు వద్ద నుంచి ఉరుటూరు వరకు జనసందోహం మధ్య సాగింది. అక్కడి నుంచి ఎర్రగుంట్ల మండలం వై.కోడూరు నుంచి ఎర్రగుంట్ల మీదుగా పోట్లదుర్తి వరకు రోడ్లన్నీ జనసంద్రమయ్యాయి. ఇలా సాగిన యాత్ర సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ప్రొద్దుటూరుకు చేరింది. లక్షలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలు ఎన్నికలకు మేము సిద్ధం అంటూ చెయ్యెత్తి జై కొట్టారు. సభా ప్రాంగణం ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది. ర్యాంప్‌పై వైఎస్ జగన్ నడుస్తున్న సందర్భంలో జనాలు కేరింతలు కొడుతూ చేతులెత్తి అభిమాన నేతకు జయజయ ధ్వానాలు చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. ప్రాంగణమంతా ఎక్కడ చూసినా జెండాలతోపాటు సిద్ధం ప్లకార్డులతో, జేబులకు పెట్టిన స్టిక్కర్లతో పండుగ వాతావరణం కనిపించింది.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధం సభలతో ఇప్పటికే సమర శంఖారావం పూరించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో ఘట్టానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బుధవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బస్సుయాత్రతో పాటు మేమంతా సిద్ధం సభల పేరుతో కార్యకర్తలను కార్యోన్ముఖులను చేశారు. తొలి రోజు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇడుపులపాయకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్ సాయంత్రం ప్రొద్దుటూరు సభ ముగిసిన అనంతరం రాత్రి 9.45 గంటల ప్రాంతంలో దువ్వూరు మండలంలోని జిల్లా సరిహద్దు ఇడమడక దాటి ఆళ్లగడ్డకు వెళ్లారు. ఆది నుంచి చివరి వరకు సీఎం వైఎస్ జగన్ జనాలతో కలుస్తూ ఉత్సాహంగా కనిపించారు. ఎండ ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో వేంపల్లెలో బస్సు పైకి ఎక్కి యాత్రలో అందరికి అభివాదం చేస్తూ ఉన్నారు. దాదాపు చాలా సేపు బస్సుపై నుంచే వేలాదిగా తరలి వచ్చిన జనానికి నమస్కరిస్తూ కనిపించారు. జగన్ పలకరింపుతో మండుటెండలో కూడా జనాలు ఉల్లాసంగా వాహనం వెంట పరుగులు తీస్తూ కనిపించారు. ప్రధానంగా చంటి బిడ్డలను ఎత్తుకుని తల్లులు.. దివ్యాంగులు, పండుటాకులు కూడా జగన్‌ను చూసేందుకు రోడ్లపై బారులు తీరారు. ఎక్కడికక్కడ రోడ్ షోలలో రోడ్డుకు రెండు వైపులా జనాలు కిక్కిరిసిపోయారు. మొత్తానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చేపట్టిన బస్సు యాత్రతోపాటు మేమంతా సిద్ధం సభ సక్సెస్‌తో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.



వేంపల్లి మండలంలో ఓ అభిమాని సమరోత్సాహం



వీరపునాయునిపల్లెలో వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు పూలు, గుమ్మడికాయలతో సిద్ధంగా మహిళలు



ఎర్రగుంట్లలో జనసందోహం మధ్య వైఎస్ జగన్ బస్సు యాత్ర

ఒంటరి కాదు.. మేమంతా ఉన్నాం

రాష్ట్రంలో కుళ్లు, కుతంత్రాలు, మోసం జతకలిసిన చంద్రబాబుతో అన్ని పార్టీలు జతకట్టాయి. కేంద్రం, కాంగ్రెస్, టీడీపీ, దత్తపుత్రుడు, ఈనాడు, ఏబీఎన్, ఒక టీవీ5 ఇలా అందరితోకాక మళ్లీ నా చెల్లెళ్లను ఉసిగొల్పారు.. అయినా సరే అందరూ ఏకమైనా నేను ఒంటరిగానే ఎన్నికలకు వెళుతున్నా అనగానే జనం కేరింతలు కొడుతూ మీరు ఒంటరి వాడు కాదు.. మేమంతా ఉన్నాం అంటూ ఉత్సాహంగా జగన్‌కు భరోసా ఇచ్చారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అడుగడుగునా తోడు ఉంటాం. మీ వైపే మేమంటూ లక్షల గొంతుకలు నినదించాయి. చిన్నాన్న వైఎస్ వివేకా హత్య గురించి.. ప్రతిపక్షాల కుట్రల గురించి వివరిస్తున్న సందర్భంలో జనం నుంచి జగన్‌కు మద్దతు లభించింది.



ఎర్రగుంట్ల వద్ద బస్సులో నుంచి జననేతను సెల్‌లో బంధిస్తున్న అభిమానులు

సర్వేజనా సుఖినోభవంతు







బస్సు యాత్ర ప్రారంభానికి ముందు ఇడుపులపాయలో సర్వమత ప్రార్థనలు



బస్సు యాత్ర దారి పొడవునా అభిమానుల కేరింతలు



కోడ్ ఉల్లంఘిస్తే కొరడా ఝుళిపిస్తాం

రాయచోటి: ఎన్నికల నిబంధలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 583 ఫిర్యాదులు అందగా వాటిలో 564 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టిసారించామని పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ పోలీస్ ఎన్ఫోర్స్‌మెంట్ టీమ్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 61.10 లక్షల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేశామని తెలిపారు. అలాగే ఏంసీసీ అతిక్రమణల కింద 7 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో సి విజిల్, ఎన్‌కోర్, ఈఎస్ఎంఎస్‌ల ద్వారా అందిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కమార్ మీనాకు వివరించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు వీడియో కాన్ఫిరెన్సులో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫిరెన్సులో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ముగిసిన పది పరీక్షలు

రాయచోటి టౌన్ : పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. బుధవారం చివరిరోజు సోషియల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులు 22827 మంది హాజరు కావాల్సి ఉండగా 22,287 మంది హాజరయ్యారు. అలాగే 760 మంది ప్రైవేట్‌గా హాజరు కావాల్సి ఉండగా 314 మంది మాత్రమే హాజరయ్యారు. రోజూ 129 సెంటర్ల ద్వారా పరీక్షలు నిర్వహించినట్లు డీఈఓ తెలిపారు.



పరీక్షలు ముగించుకొని ఇళ్లకు వెళ్లుతున్న విద్యార్థులు



మాటేసిన రోడ్డు ప్రమాదం

పదో తరగతి పరీక్షలు రాసి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని ఆ విద్యార్థి కన్న కలలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. అతడి తల్లిదండ్రులను గుండెకోతకు గురిచేసింది. బుధవారం ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో శ్రీసాయి చరణ్ తేజ్ అనే పదో తరగతి విద్యార్థి దుర్మరణం చెందాడు. ఇతడితోపాటు బైక్‌లో వస్తున్న మరో విద్యార్థి.. మరో ద్విచక్రవాహనంలో వస్తున్న ఇద్దరు గాయపడ్డారు.

• పదో తరగతి విద్యార్థి దుర్మరణం

– మరో విద్యార్థితో పాటు ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన శ్యాము, నరసింహులు, విద్యార్థి వెంకటేష్


మృతి చెందిన విద్యార్థి శ్రీసాయి చరణ్‌తేజ్ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం రాయాల్సిన చివరి పరీక్ష రోజున విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో శ్రీసాయి చరణ్ తేజ్ (15) అనే విద్యార్థి మృతి చెందగా వెంట ఉన్న మరో విద్యార్థితో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బి.కొత్తకోటకు చెందిన పూల శ్రీనివాసులు అనే వ్యక్తి మండలంలోని పులికల్లు సమీపంలో అల్లనేరేడు కాయలు కోయడానికి ఉదయాన్నే ఇంటి నుంచి బయలుదేరి వెళుతూ భోజనం క్యారియర్‌ను బస్సులో పెట్టి పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు వెళ్లాలని కుమారుడు వెంకటేష్‌కు సూచించాడు. అనంతరం ఏం జరిగిందో ఏమో గాని ఆ విద్యార్థి వెంకటేష్ బస్సులో భోజనం క్యారియర్ పెట్టకుండా అతడి స్నేహితుడైన శ్రీసాయిచరణ్ తేజ్ (15)తో కలసి ద్విచక్ర వాహనంలో భోజనం క్యారియర్‌తో పులికల్లుకు బయలు దేరారు. ఈ నేపథ్యంలో కాట్నగల్లుకు చెందిన నరసింహులు (30), శ్యాము (35)లు వంట గ్యాస్ కోసం ఖాళీ సిలిండర్‌తో ద్విచక్ర వాహనంలో పీటీఎంకు బయలు దేరారు. ఈ తరుణంలో మండలంలోని కుమ్మరవారిపల్లి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు బలంగా ఢీకొన్నాయి. దీంతో రెండు వాహనాల్లో ఉన్న వారికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను 108 ద్వారా బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో విద్యార్థి శ్రీ సాయి చరణ్‌తేజ్ పరిస్థితి విషమించి ఆసుపత్రిలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శ్రీసాయి చరణ్‌తేజ్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కాగా నరసింహులు, శ్యాము, విద్యార్థి వెంకటేష్‌లు చికిత్స పొందుతున్నారు.

పోతుపేటలో విషాదఛాయలు..

మృతి చెందిన విద్యార్థి స్వగ్రామమైన పోతుపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సాయిచరణ్‌తేజ్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకు రావడంతో కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యార్థి తండ్రి రమణ పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తుండటంతో పీటీఎం, ములకలచెరువు ఎస్‌ఐలు తిప్పేస్వామి, రవీంద్రబాబులతో పాటు సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కోటి ఆశలతో దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టారు వారు.. విధి వక్రీకరించడంతో రోడ్డు ప్రమాదం వారి ఆశలను గల్లంతు చేసింది. వివాహమైన ఐదు నెలలకే భర్తను బలి తీసుకుంది. భార్యను తీవ్రగాయాలపాలు జేసింది. కళ్లెదుటే కట్టుకున్నవాడు విగతజీవిగా పడిఉండడంతో ఆ ఇల్లాలు గుండెలవిసేలా రోదిస్తోంది.

• లారీ ఢీ కొనడంతో భర్త మృతి

– భార్యకు తీవ్ర గాయాలు


శ్రీలేఖకు చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది


సంఘటన స్థలంలో మృతి చెందిన హరి


హరి (ఫైల్)

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని ఊటుకూరు సమీపంలోని అశోక్‌గార్డెన్స్(రాజంపేట) వద్ద బుధవారం ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో భర్త అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. భార్య తీవ్రగాయాల బారిన పడింది. వివరాలిలా ఉన్నాయి.. పుల్లంపేట మండలం (వత్తలూరు) దేవసముద్రం వడ్డిపల్లెకు చెందిన ఊర్సు బీ.హరి(24), చిట్వేలి మండలం వడ్డిపల్లెకు చెందిన శ్రీలేఖతో ఐదునెలల కిందట వివాహమైంది. ఈ నేపథ్యంలో భార్యభర్తలిద్దరూ చిట్వేలి వడ్డిపల్లె నుంచి బైకులో రాజంపేట మండలం గోపమాంబపురం వడ్డిపల్లెకు వస్తుండగా అశోక్‌గార్డెన్ వద్ద లారీ ఢీ కొంది. దీంతో భర్త హరి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య శ్రీలేఖకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆమెను రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఐదునెలల క్రితం వివాహం కావడం, ప్రమాదంలో భర్తను కోల్పోవడంతో భార్య పరిస్థితిని చూసిన పలువురు కంటతడి పెట్టారు. కాగా హరి ఒక్కగానొక్క కొడుకు కావడంతో అతడి తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

క్లుప్తంగా

నాటు తుపాకీ స్వాధీనం

కలికిరి : మండలంలోని పత్తేగడ గ్రామం పొలంలో నాకాబంది నిర్వహించి నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. వివరాలు... ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా బుధవారం పొలంలో నాకాబందీ నిర్వహించగా పొలం సమీపంలోని గడ్డివామిలో నాటు తుపాకీ గుర్తించామని, అదే గ్రామానికి చెందిన ఎం.రమణ అక్రమంగా దాచి ఉంచినట్లు గుర్తించి నాటు తుపాకీతో పాటు నల్లమందు, రవ్వలు, ఇనుప గుండ్లు సీజ్ చేసి వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

మల్లూరమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లి ఆలయంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు. ఆలయ ఉన్నతాధికారుల అధ్యక్షతన జరిగిన లెక్కింపులో రూ.2,92,741 ఆదాయం వచ్చింది. ఈ నగదును బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రూ.3 లక్షలు పట్టివేత

బి.కొత్తకోట : కారులో రూ.3 లక్షలు తీసుకొస్తుండగా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ సూర్యనారాయణ కథనం మేరకు వివరాలు.. బెంగళూరులో ఉంటున్న సుదర్శన్ పెద్దతిప్పసముద్రం మండలం బూర్లపల్లెలో ఉంటున్న బంధువుల వద్దకు బయలుదేరాడు. బి.కొత్తకోట మండలం తానామిట్ట చెక్‌పోస్టు వద్దకు రాగానే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.3 లక్షల నగదు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్టు తెలిపారు.

వివాహిత అదృశ్యం

బి.కొత్తకోట : ఓ వివాహిత అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు బుధవారం తెలిపారు. బి.కొత్తకోటకు చెందిన శంకరమ్మ కుమార్తె భువనేశ్వరి (19)కి వివాహమైంది. ఈమె ఈనెల 22 నుంచి అదృశ్యమైందని, తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని తల్లి శంకరమ్మ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులో ఆలేటివారిపల్లెకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేయడంతో దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి


డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలను కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి మూల్యాంకన విధులు నిర్వహించే సిబ్బందికి తగిన సౌకర్యాలను కల్పించాలన్నారు. 58 సంవత్సరాల వయసు దాటిన ఉపాధ్యాయులకు, గర్భవతులు, చిన్న పిల్లల తల్లులకు, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని కోరారు. అలాగే ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయడంతోపాటు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎండ తీవ్రతతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే గత ఏడాది మూల్యాంకన విధులు నిర్వహించిన కొంతమంది ఉపాధ్యాయులకు ఇప్పటికి కూడా పూర్తిస్థాయిలో రెమ్యునేషన్ చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా సీనియర్ నాయకులు చంద్రశేఖర్, సురేష్‌లతోపాటు ఒంటిమిట్ట, చిత్వేలి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించండి

- లేకపోతే పది మూల్యాంకనం బహిష్కరిస్తాం
- డీఈఓకు నోటీసు ఇచ్చిన ఫ్యాప్టో నేతలు


డీఈఓకు స్పాట్ బహిష్కరణ నోటీసును అందచేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : గత సంవత్సరం 10వ తరగతి జవాబుపత్రాలను దిద్ది మార్కులు వేసిన బాధ్యతలకు గాను ఉపాధ్యాయులకు చెల్లించవలసిన డీఏ, రెమ్యూనరేషన్ ఇంతవరకు అధికారులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఈ యేడాది నిర్వహించే టెన్త్‌స్పాట్‌ను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో నేతలు పేర్కొన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం డీఈఓ శివప్రకాష్‌రెడ్డిని కలిసి నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాదికి సంబంధించిన రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో టెన్త్‌స్పాట్‌ను బహిష్కరిస్తామన్నారు. గత వేసవిలో అరకొర వసతుల నడుమ పేపర్లను దిద్ది సకాలంలో మార్కులు వేశామన్నారు. అయితే ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన డీఏ, రెమ్యూనరేషన్ చెల్లింపు అంశంపై అనేకమార్లు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో నేతలు శివారెడ్డి, రాయచోటి రవిశంకర్, గఫార్‌ఖాన్, ఇలియాస్, జాబీర్, సబాతుర్ రహిమాన్, రవీంద్రనాథరెడ్డి, రామక్రిష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడు.. ఇదిగో అమలయింది చూడు


ఎన్నికల కోడ్ రాగానే శిలాఫలకంలో జగన్ ఫోటోలు కనిపించకుండా ముసుగు వేస్తున్న సిబ్బంది (ఫైల్)


శిలాఫలకానికి వేసిన ముసుగును తొలగించి కిందపడేసిన దృశ్యం

ఫ్యాక్ట్ చెక్

రాజంపేట టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని పచ్చ పత్రిక అవాస్తవమైన వార్తలతో విషం జిమ్ముతోంది. ఇక అసలు విషయానికి వస్తే ఎన్నికల కోడ్ రాగానే రాజంపేట పట్టణంలోని మన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న శిలాఫలకంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న ఫోటోలను కనిపించకుండా మున్సిపల్‌శాఖ సిబ్బంది ముసుగు వేశారు. అయితే గాజుగ్లాసు పార్టీకి చెందిన ఆకతాయిలు శిలాఫలకానికి వేసిన ముసుగును ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. అయితే అక్కడి ఆనవాళ్ళను సైతం పరిశీలించకుండానే పచ్చపత్రిక ప్రతినిధులు తమ పత్రికలో 'ఎన్నికల కోడు....అమలు కాలేదు చూడు' అన్న శీర్షికతో వార్తను ప్రచురించి జగన్‌పై ఉన్న అక్కసును వెల్లగక్కారు. అయితే 'సాక్షి' వాస్తవాన్ని పరిశీలించేందుకు వెళ్ళగా శిలాఫలకంపై వేసిన ముసుగును కావాలనే తొలగించిన విషయం స్పష్టంగా కనిపించింది. అక్కడి వైద్య సిబ్బంది కూడా ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే శిలాఫలకంలోనే కాక గోడలపై కూడా ఉన్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలకు స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు. కాగా పచ్చపత్రిక జగన్‌పై విషం జిమ్మడాన్ని అక్కడి ప్రజలు తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రపంచ గమనంలో మార్పు

టీసీఎస్ రీజియన్ హెడ్ రిచర్డ్ కింగ్


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మాట్లాడుతున్న రిచర్డ్ కింగ్

కురబలకోట : ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గురించి చర్చ జరుగుతోందని.. ఇది మానవ మేధకు మరో రూపమని టీసీఎస్ హైదరాబాదు రీజియన్ హెడ్ రిచర్డ్ కింగ్ అన్నారు. బుధవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యంత్రాలచేత ప్రదర్శింపబడే మేధస్సునే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అన్నారు. అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకు వస్తోందన్నారు. అద్భుతాలు సృష్టిస్తోందన్నారు. మనిషి జీవితంలో విడదీయరాని బంధంగా మారిందన్నారు. విద్య నుంచి వైద్యం వరకు, వ్యాపారం నుండి వ్యవసాయం, మిలటరీ రంగం వరకు ఇలా దీని ప్రమేయం లేని రంగం లేదనే చెప్పవచ్చన్నారు. నిప్పు, విద్యుత్ ఎలా ప్రపంచ గతిని మార్చాయో ఇప్పుడు ఇది కూడా విప్లవాత్మక మార్పులకు కారణం కాగలదన్నారు. ప్రపంచ గమనాన్ని మారుస్తున్న దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. వివిధ ఉద్యోగులు కూడా దీన్ని నేర్చుకుని అప్‌గ్రేడ్ కావాలన్నారు. లేదంటే ఉద్యోగాలు పోయే అవకాశం లేకపోలేదన్నారు. ప్రపంచంలో టాప్ టెక్నాలజీ కంపెనీలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడులను పెంచుకుంటూ పోతున్నాయన్నారు. అమెజాన్, అలెక్సా వంటి సంస్థలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత ఎలక్ట్రానిక్ వస్తువులు ఇప్పటికే వచ్చేశాయన్నారు. ఎన్నో ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు సరికొత్త పరిశోధనలు చేయాలని కోరారు. ఈ రంగంలో ఉపాధి, ఉద్యోగావకాశాలకు కొదువ లేదన్నారు.

1 నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణా తరగతులు

– కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి తరువాత పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు కడప పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందుకు సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి వివిధ డిప్లమా ఇంజనీరింగ్ కోర్సులు చేరాలనుకునే విద్యార్థుల కోసం పాలిసెట్ –2024 పరీక్షను ఏప్రిల్ 27వ తేదీ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులను కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇంగ్లీష్, తెలుగు స్టడీ మెటీరియల్‌ను ఇస్తామని తెలిపారు. ఉచిత శిక్షణా తరగతులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. విద్యార్థులు తమ పదవ తరగతి హాల్ టికెట్, ఫోటో, ఆధార్‌కార్డు నెంబర్, తమ మొబైల్ ఫోన్‌తోపాటు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ. 400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 100 రుసుము చెల్లించాలన్నారు. సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. లేకుంటే ఆన్‌లైన్ హెచ్‌టిటిపిఎస్://పాలిసెట్‌ఏపీ.ఎస్‌బిసి.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. దీని వల్ల 2024–25 విద్యా సంవత్సరం నుండి మూడేళ్లు కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు, రాయితీలు లభిస్తాయి. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఇక్కడ చదివిన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలలో కూడా ప్రాధాన్యత ఉంటుంది. మూడేళ్ల తర్వాత ఎన్‌బీఏ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే మళ్లీ గుర్తింపు కొనసాగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఎన్‌బీఏ బృందం చైర్మన్ డాక్టర్ రాజీవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సిబ్బంది సౌకర్యాలు, హాస్టల్, వర్క్‌షాప్, ల్యాబ్స్, ప్లే గ్రౌండ్ తదితర 10 విభాగాలకు సంబంధించి వారు తనిఖీ చేశారు. ఎన్‌బీఏ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చారు.

ప్రత్యేక రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి–షోలాపూర్–తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువును జూన్ 28వ తేది వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ ఏడాది మార్చి 29వ తేది వరకు నడపనున్నట్లు అధికారులు గతంలో ప్రకటించారని, అయితే ప్రయాణీకుల రద్దీ అధికంగా ఉండడంతో రైల్వే ఉన్నతాధికారులు జూన్ 28వ తేది వరకు పొడిగించారన్నారు. షోలాపూర్ (01437) నుంచి తిరుపతికి వెళ్లే రైలు ప్రతి గురువారం రాత్రి 9.00 గంటలకు షోలాపూర్‌లో బయలుదేరి కడపకు ఉదయం 4.55 గంటలకు చేరుకుని తిరుపతికి 7.45 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి (01438) ప్రతి శుక్రవారం రాత్రి 9.10 గంటలకు బయలుదేరి కడపకు 11.10 గంటలకు చేరుకుని మరుసటిరోజు సాయంత్రం 7.10 గంటలకు షోలాపూర్ చేరుతుందన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన నారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన జీవీ నారాయణరెడ్డి బుధవారం ప్రొద్దుటూరులో జరిగే మేమంతా సిద్ధం సభకు వస్తుండగా బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నారాయణరెడ్డి సిద్ధం సభకు రావడానికి గ్రామం క్రాసు రోడ్డు వద్ద నుంచి కారు ఎక్కడానికి రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన నారాయణరెడ్డిని వెంటనే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఆసుపత్రికి తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన ఎర్రగుంట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ అతి సమీపంలో వెన్నపూస రామచంద్రారెడ్డి (47) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారని రైల్వే పోలీసులు తెలిపారు. కదిరిపల్లె గ్రామానికి చెందిన వెన్నపూస రామచంద్రారెడ్డి ఎర్రగుంట్ల పట్టణంలోని మహాత్మనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. పట్టణంలో పాలీస్ మిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు కలరు. సంఘటన స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చోరీ సొమ్ము రికవరీ

– నిందితులు అరెస్టు

ముద్దనూరు : ఏడాది క్రితం జరిగిన బంగారు చోరీ కేసులో నిందితులను అరెస్టుచేసి, చోరీకి గురైన సొమ్మును స్థానిక పోలీసులు రికవరీ చేశారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు... 2023 ఫిబ్రవరి 15వ తేదీన స్థానిక 4 రోడ్ల కూడలి సమీపంలో పులివెందుల రహదారిలో వున్న పొలగిరి విశ్వనాథ ఆచారి ఇంటిలో బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఇంటిలో ఎవరూ లేని సమయంలో అప్పట్లో ఈ దొంగతనం జరిగింది. ఈ కేసులో శ్రీసత్యసాయిజిల్లా ధర్మవరానికి చెందిన నమ్మే రామాంజినేయులు, కదిరికి చెందిన యనమల ఆంజనేయులు అనే నిందితులను అరెస్టు చేసి, 18.5 తులాల బంగారు నగలను రికవరీ చేసినట్లు బుధవారం సీఐ తెలిపారు.

బాకీ విషయమై ఘర్షణ

కడప అర్బన్ : కడప నగరంలోని నబీకోట శివాలయం సమీపంలో బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు బాకీ విషయమై ఒకరిచొక్కా, మరొకరు పట్టుకుని ఘర్షణ పడ్డారు. నబీకోట ప్రాంతానికే చెందిన ఇరువురు ఒకరినొకరు ఎదురుపడ్డారు. బాకీ విషయమై మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. నడిరోడ్డుపై ఈ సంఘటన జరగడంతో వాహనాల రాకపోకలకు దాదాపు అరగంటసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో స్థానికులు కలుగచేసుకుని వారిని విడిపించి అక్కడి నుంచి పంపించారు. ఈ సంఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోపు ఎవరూలేరు. అంతేగాకుండా ఎవరూ ఫిర్యాదు చేయలేదని కడప తాలూకా పోలీసులు తెలియజేశారు.

బీజేపీ అభ్యర్థుల ఖరారు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రానున్న సార్వత్రిక ఎన్నిక ల్లో జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు తమ అభ్యర్థులను ఖరారు చేస్తూ బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. జమ్మలమడుగు అభ్యర్థిగా సి.ఆదినారాయణరెడ్డి, బద్వేలు అభ్యర్థిగా బొజ్జా రోషన్నను ప్రకటించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Polytechnic, APRJC ఇంటర్ ఫౌండేషన్ కోచింగ్ 02/04/24 నుండి ప్రారంభం. 20సం॥ అనుభవం గల టీచర్లచే విద్యాబోధన. నగేష్ అకాడమీ. కడప. 7569470028

ADMISSIONS

■ B.A-6,600, B.Com-6k, B.Sc-10k, P.G.Arts-8k, yearly in Distance at PLNM Degree college ✆ 91774 08565/ 9642656449 M.B.A-16k,MCA-20k Sem Admns Last Date: 25/3/24. Penalty Fee: 26th-30th March.

SERIVCES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్ 73821 14847

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835.

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిసరుకు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9810515624, 8800496710

CHANGE OF NAME

■ I Mekala Sambaiah (Old Name), D.No. 81/182, Palempalli, Kadapa,YSR Dist, A.P . Here Change my Name as Mekala Samba Siva (New Name) S/o Mekala Hanumanthaiah, Henceforth I May be called as Mekala Samba Siva.

■ I Moghal Kaleem Baig (Old Name), D.No. 8/1474-2, Agadi Street, Kadapa, YSR Dist, A.P. Here Change my Name as Mogal Kaleem Baig (New Name) S/o Mogal Akbar Baig. Henceforth I May be called as Mogal Kaleem Baig.

WANTED

■ కడప (పాత బస్టాండ్ దగ్గర) ప్రముఖ దంత వైద్యశాల నందు పనిచేయుటకు 10th, Inter చదివిన స్త్రీలు కావలెను. సంప్రదించండి సెల్: 93901 20166.

■ ప్రముఖ కంపెనీ వారి Central Project Works తో మంచి Income మండలాల వారిగా పనిచేయడానికి సంప్ర : 9000977523.

■ యర్రగుంట్ల ఏరియాలో సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. యర్రగుంట్ల నుండి 35 కి.మీ. దూరంలో, Age: 45 సం.లోపు, Qly: 10th & above, PF, ESI కలదు. ✆ 7569571026, 8374614105

■ కడప జిల్లాలో MSME Projectలో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. చదువు : ఏదైనా డిగ్రీ. సంప్ర॥ ✆ 82971 59036.

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం కలదు. Q: 10th, Inter, Degree (P/F), Age: 18 to 30. నో ఫీజ్. Cell: 9177342337.

■ వృద్ధులకు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ. 15000 - 40000. ఫ్రీ రూమ్+భోజనం. HYD ఫోన్ 8014885408.

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

